క్లుప్తంగా

ఆనంద్ మోహన్ విడుదలపై సుప్రీంకోర్టుకు ఉమా కృష్ణయ్య

న్యూఢిల్లీ: తెలంగాణ ప్రాంతానికి చెందిన ఐఏఎస్ అధికారి జి.కృష్ణయ్య హత్య కేసులో దోషి, రాజకీయనేతగా మారిన గ్యాంగ్‌స్టర్, బిహార్ మాజీ ఎంపీ ఆనంద్ మోహన్‌ను జైలు నుంచి ముందుగానే విడుదల చేయడాన్ని సవాల్ చేస్తూ కృష్ణయ్య భార్య ఉమా కృష్ణయ్య సుప్రీంకోర్టును ఆశ్రయించారు. బిహార్ ప్రభుత్వం జైలు నిబంధనలను మార్చడంతో గురువారం ఆనంద్ మోహన్ సహర్సా జైలు నుంచి విడుదలైన విషయం తెలిసిందే. 1994 నాటి కృష్ణయ్య హత్య కేసులో గ్యాంగ్‌స్టర్, రాజకీయ నాయకుడు ఆనంద్‌మోహన్‌కు జీవిత కాల జైలు పడిందనీ, నిబంధనలను మార్చి ఆ శిక్షను 14 ఏళ్లుగా అన్వయించడం తగదని ఆ పిటిషన్‌లో ఉమా కృష్ణయ్య పేర్కొన్నారు. మరణ శిక్షకు బదులుగా విధించిన జీవిత ఖైదు శిక్షను కోర్టు ఆదేశాల ప్రకారం కచ్చితంగా అమలు చేయాల్సిందేనని, ఇందులో రెమిషన్ ఉండరాదని పేర్కొన్నారు.

బైజూస్ కార్యాలయాల్లో ఈడీ సోదాలు

కీలక పత్రాలు, డిజిటల్ డేటా స్వాధీనం

న్యూఢిల్లీ: ఫారిన్ ఎక్స్ఛేంజ్ మేనేజ్‌మెంట్ యాక్ట్(ఫెమా)ను ఉల్లంఘించినట్లు ఆరోపణలు ఎదుర్కొంటున్న ప్రముఖ ఎడ్‌టెక్ సంస్థ బైజూస్ కార్యాలయాల్లో ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్(ఈడీ) అధికారులు శనివారం సోదాలు నిర్వహించారు. థింక్ అండ్ లెర్న్ ప్రైవేట్ లిమిటెడ్ ఆఫీసులో, బైజూస్ సంస్థ సీఈఓ రవీంద్రన్ బైజూకు సంబంధించిన భవనంలో సోదాలు చేపట్టినట్లు అధికారులు వెల్లడించారు. మొత్తం రెండు కార్యాలయాలు, ఒక నివాస భవనంలో సోదాలు జరిపామన్నారు. కొన్ని కీలక పత్రాలు, డిజిటల్ డేటాను స్వాధీనం చేసుకున్నట్లు ఒక ప్రకటనలో తెలిపారు. విచారణకు హాజరు కావాలంటూ పలుమార్లు సమన్లు పంపించినా రవీంద్రన్ బైజు స్పందించలేదని ఈడీ ఆరోపించింది. థింక్ అండ్ లెర్న్ ప్రైవేట్ లిమిటెడ్ 2011 నుంచి 2023 మధ్య కాలంలో రూ.28 వేల కోట్ల విదేశీ ప్రత్యక్ష పెట్టుబడులను (ఎఫ్‌డీఐ) పొందినట్లు పేర్కొంది. అలాగే ఈ కంపెనీ ఓవర్సీస్ డైరెక్ట్ ఇన్వెస్ట్‌మెంట్ పేరుతో వివిధ విదేశీ అధికారులకు దాదాపు రూ.9,754 కోట్లను పంపినట్లు ఈడీ ఆరోపించింది. థింక్ అండ్ లెర్న్ సంస్థ 2020–21 నుంచి ఫైనాన్షియల్ స్టేట్‌మెంట్లు తయారు చేయడం లేదని, ఖాతాల ఆడిటింగ్ కూడా నిర్వహించడం లేదని ఆరోపించింది. ఇదిలా ఉండగా, ఈడీ సోదాలపై బైజూస్ లీగల్ టీమ్ ప్రతినిధి స్పందించారు. తమ కంపెనీ పూర్తి పారదర్శకంగా పనిచేస్తోందని, అధికారులు అడిగిన సమాచారం అందించామని తెలియజేశారు. ఈ సోదాలు సాధారణంగా జరిగినవేనని పేర్కొన్నారు.


ఒక్కలిగల కంచుకోటలో పాగా ఎవరిదో...!

పాత మైసూరుపై పార్టీలన్నింటి కన్ను

- ఒక్కలిగల ఓట్ల కోసం తీవ్ర యత్నాలు
- జేడీ(ఎస్)కే జై కొడుతూ వస్తున్న ప్రాంతం

పాత మైసూరు. కర్ణాటకలో అధికార పీఠానికి రాచమార్గంగా భావించే ప్రాంతం. మెజారిటీ కావాలంటే ఇక్కడ అత్యధిక స్థానాలు గెలుపొందాల్సిందేనని పార్టీలన్నింటికీ బాగా తెలుసు. ఈ ప్రాంతంలో ఒక్కలిగ సామాజిక వర్గం ప్రభావం అధికం. వారిని ప్రసన్నం చేసుకోగలిగే పార్టీదే పాత మైసూరు. అందుకోసమే పార్టీలన్నీ వారిని ప్రసన్నం చేసుకునే పనిలో పడ్డాయి...





సాక్షి బెంగళూరు: కర్ణాటక జనాభాలో ఒక్కలిగ సామాజికవర్గం 15 శాతం ఉంటుందని అంచనా. లింగాయత్ (17 శాతం)ల తర్వాత రాష్ట్రంలో అత్యధిక జనాభా ఉన్న సామాజికవర్గం వీరే. ఉత్తర కర్ణాటక లింగాయత్ బెల్ట్ కాగా పాత మైసూరు ఒక్కలిగల కంచుకోట. ప్రతి ఎన్నికల్లోనూ ప్రభుత్వ ఏర్పాటులో ఈ వర్గం కీలక పాత్ర పోషిస్తోంది. వీరు కొన్ని దశాబ్దాలుగా ఒక్కలిగలు జేడీ(ఎస్)నే ఆదరిస్తూ వస్తున్నారు. ఈసారి వారిని తమవైపు తిప్పుకునేందుకు కాంగ్రెస్, **బీజేపీలు** తీవ్రంగా శ్రమిస్తున్నాయి.

ఏడుగురు సీఎంలను ఇచ్చిన ప్రాంతం

- రాష్ట్రంలో మొత్తం 224 అసెంబ్లీ స్థానాల్లో పాత మైసూరు ప్రాంతంలో 51 సీట్లున్నాయి. 2018 అసెంబ్లీ ఎన్నికల్లో జేడీ(ఎస్) పార్టీ 24 స్థానాల్లో, కాంగ్రెస్ 16 స్థానాల్లో, బీజేపీ 9 చోట్ల గెలిచాయి.
- కావేరి వివాదం, రైతు ఆత్మహత్యల వంటి సమస్యలు ఈ ప్రాంతాన్ని పట్టి పీడిస్తున్నాయి.
- మేజిక్ నంబర్ సాధించడంలో ఈ ప్రాంతం కీలకం.
- గతంలో ముఖ్యమంత్రులుగా చేసిన 17 మందిలో ఏకంగా ఏడుగురు ఒక్కలిగ సామాజిక వర్గానికి చెందిన వారే! ఈ సామాజికవర్గానికి చెందిన హెచ్.డి.దేవెగౌడ ప్రధాని పదవి దాకా ఎదిగారు.
- ఈ ప్రాంతంలో ప్రస్తుతానికి జేడీ(ఎస్) చాలా బలంగా ఉంది.
- మండ్య, హసన్, రామనగర, మైసూరు, చామరాజనగర, కోలార్, తుమకూరు, కొడగు జిల్లాల్లో ఒక్కలిగలు అధికంగా ఉంటారు.
- ఒక్కలిగల ఓట్లను ఒడిసిపట్టేందుకు అధికార బీజేపీ తాజాగా వారి రిజర్వేషన్లను **4 శాతం** నుంచి 6 శాతానికి పెంచింది.
- **ఇక కాంగ్రెస్** ఒక్కలిగలకు ఎక్కువగా టికెట్లిచ్చి **అదృష్టా**న్ని పరీక్షించుకుంటోంది.
- **జేడీ**(ఎస్) మాత్రం తన సంప్రదాయ ఓటుబ్యాంకు **మళ్లీ** చెక్కుచెదరబోదని ధీమాగా ఉంది.

కాంగ్రెస్.. గత వైభవమే

పాత మైసూరు ప్రాంతంలో కాంగ్రెస్ ఒకప్పుడు తిరుగులేని పార్టీ. దేవెగౌడ రూపంలో బలమైన ఒక్కలిగ నేత రాకతో ఇక్కడ దాని ప్రభ మసకబారింది. ఈ ప్రాంతా**నికే** చెందిన ముఖ్య ఒక్కలిగ నేత పీసీసీ **చీఫ్** డి.కె.శివకుమార్‌పైనే ఈసారి కాంగ్రె**స్ ఆశ**లన్నీ పెట్టుకుంది.

ఇంటిపోరు జేడీ(ఎస్)ను ముంచేనా...?

దేవెగౌడ కుటుంబంలో వారసత్వ రగడ మొదలైంది. ఆయన కుమారుల్లో జేడీ(ఎస్) నేత హెచ్.డి.కుమారస్వామి రామనగర, మైసూరు, మండ్య జిల్లాల్లో గట్టి నాయకుడు కాగా సోదరుడు హెచ్.డి.రేవణ్ణ హాసన్ జిల్లాలో తిరుగులేని నేత. కొద్ది నెలలుగా వీరి మధ్య విభేదాలు పొడచూపాయి. హాసన్ టికెట్ విషయంలో ఇవి రచ్చకెక్కాయి. అక్కడ రేవణ్ణ భార్య భవానీని కాదని అతి సామాన్య కార్యకర్తకు కుమారస్వామి టికెటిచ్చారు. ఈ గొడవ కొంప ముంచుతుందేమోనని జేడీ(ఎస్) వర్గాల్లో ఆందోళన నెలకొంది.

బీజేపీ...

ఇక బీజేపీది భిన్నమైన పరిస్థితి! పాత మైసూరులో పార్టీకి ఒక్కరంటే ఒక్కరు కూడా **బ**లమైన ఒక్కలిగ నాయకుడు లేదు. దాంతో **ప్ర**తి ఎన్నికల్లోనూ కాంగ్రెస్, జేడీ(ఎస్)ల తర్వాతి **స్థా**నానికే పరిమితమవుతూ వస్తోంది. అయితే 2018 **ఎన్ని**కల్లో కాస్త పుంజుకున్న నేపథ్యంలో ఈసారీ భారీ**గానే ఆశ**లు పెట్టుకుంది. గత తప్పిదాలను సరిదిద్దుకుం**టూ బలమైన** స్థానిక నేతలను చేర్చుకుని టికెట్లిచ్చింది.

అన్సారీ సోదరులకు జైలు శిక్ష

బీఎస్పీ నేత అఫ్జల్ అన్సారీపై ఎంపీగా అనర్హత వేటు పడే చాన్స్



ఘజియాబాద్(యూపీ): గ్యాంగ్‌స్టర్ చట్టం కింద 2007లో నమోదైన కేసులో ఉత్తరప్రదేశ్‌లోని ఎంపీ/ఎమ్మెల్యే కోర్టు రాజకీయనేతగా ఎదిగిన గ్యాంగ్‌స్టర్ ముఖ్తార్ అన్సారీ, ఆయన సోదరుడు బీఎస్పీ ఎంపీ అఫ్జల్ అన్సారీలను దోషిగా తేలుస్తూ వారికి జైలు శిక్ష విధించింది. ముఖ్తార్‌కు పదేళ్ల జైలు శిక్ష, రూ.5 లక్షల జరిమానా, అఫ్జల్‌కు నాలుగేళ్ల జైలు శిక్ష, రూ.1 లక్ష జరిమానా విధిస్తూ అదనపు సెషన్స్ న్యాయమూర్తి దుర్గేశ్ తీర్పు చెప్పారని అదనపు జిల్లా ప్రభుత్వ న్యాయవాది(నేర) నీరజ్ శ్రీవాస్తవ చెప్పారు. ఘజియాబాద్ బహుజన్ సమాజ్ పార్టీ ఎంపీ అయిన అఫ్జల్‌ను కేసు విచారణ సందర్భంగా కోర్టులో హాజరుపర్చగా ముఖ్తార్‌ను వీడియో కాన్ఫరెన్స్ ద్వారా హాజరుపరిచారు. తీర్పు తర్వాత అఫ్జల్‌ను పోలీసులు జైలుకు తరలించారు. ప్రజాప్రతినిధుల చట్టం ప్రకారం ఏదైనా కేసులో దోషిగా తేలి ఎంపీకి రెండేళ్లు, అంతకంటే ఎక్కువ కాలం శిక్ష పడితే ఆ సభ్యుడిని ఎంపీగా అనర్హుడిగా ప్రకటిస్తారు. అఫ్జల్‌కు ఏకంగా నాలుగేళ్ల శిక్ష పడటంతో ఆయన అనర్హత దాదాపు ఖాయమైంది. ప్రజా ప్రతినిధుల చట్టం ప్రకారం దోషులుగా తేలడంతో రాహుల్ గాంధీ(వయనాడ్ స్థానం), ఆజం ఖాన్(రామ్‌పూర్), అతని కుమారుడు అబ్దుల్లా ఆజం(సుఆర్), బీజేపీ నేత విక్రమ్ సైనీ(ఖతౌలీ–ముజఫర్‌నగర్)లు ఇప్పటికే తమ పదవులకు అనర్హులైన విషయం విదితమే. 1997లో వారణాసికి చెందిన వ్యాపారి నంద్‌కిషోర్ అపహరణ, హత్య, 2005లో నాటి ఘాజీపూర్ ఎమ్మెల్యే కృష్ణానంద్ రాయ్‌ను హత్యచేశారనే ఆరోపణలపై అన్సారీ సోదరులపై 2007 నవంబర్ 22న యూపీలోని కొత్వాలీ పోలీస్‌స్టేషన్‌లో యూపీ గ్యాంగ్‌స్టర్స్ చట్టం కింద కేసు నమోదైంది. ఈ కేసులో వీరిని గత సెప్టెంబర్‌లో దోషులుగా తేల్చి తీర్పు రిజర్వ్‌చేసి శనివారం వెలువర్చింది. మవూ సదర్ అసెంబ్లీ స్థానం నుంచి అఫ్జల్ గతంలో ఐదు సార్లు ఎమ్మెల్యేగా గెలిచారు.

శతఘ్ని దళంలోకీ మహిళల అడుగు

- మొదటి బ్యాచ్‌లో అయిదుగురిని తీసుకున్న ఆర్మీ
- ముగ్గురికి ఎల్‌ఏసీలో, ఇద్దరికి పాక్ సరిహద్దుల వెంట బాధ్యతలు



న్యూఢిల్లీ: భారత సైన్యం మరో చారిత్రక నిర్ణయం తీసుకుంది. మొట్టమొదటి సారిగా ఆర్టిలరీ రెజిమెంట్‌లోకి అయిదుగురు మహిళా అధికారులను ఎంపిక చేసింది. వీరిలో ముగ్గురికి చైనాతో సరిహద్దుల్లో నియంత్రణ రేఖ(ఎల్‌ఏసీ) వెంబడి, ఇద్దరికి పాక్ సరిహద్దుల్లోని కీలకమైన ప్రాంతాల్లో బాధ్యతలు అప్పగించింది. చెన్నైలోని ఆఫీసర్స్ ట్రెయినింగ్ అకాడమీ(ఓటీఏ)లో విజయవంతంగా శిక్షణ పూర్తి చేసుకున్న లెఫ్టినెంట్ మెహక్ సైనీ, లెఫ్టినెంట్ సాక్షి దుబే, లెఫ్టినెంట్ అదితి యాదవ్, లెఫ్టినెంట్ పయిస్ ముద్గిల్, లెఫ్టినెంట్ ఆకాంక్షలను ప్రతిష్టాత్మక ఆర్మీ ఆర్టిలరీ విభాగంలోకి ఎంపిక చేసినట్లు శనివారం సైనిక వర్గాలు వెల్లడించాయి. ప్రధాన పోరాట విభాగమైన రెజిమెంట్ ఆఫ్ ఆర్టిలరీలో 280 యూనిట్లుంటాయి. ఇందులో బోఫార్స్ హొవిట్జర్లు, ధనుష్, ఎం–777 హొవిట్జర్లు, కె–9 వజ్ర వంటి శతఘ్ని ఆయుధ వ్యవస్థల నిర్వహణలో పనిచేయాల్సి ఉంటుంది. ఆర్టిలరీలోని అన్ని విభాగాల్లోనూ కొత్త మహిళా అధికారులకు బాధ్యతలు అప్పగిస్తామని, వీరు అత్యంత క్లిష్టతరమైన పరిస్థితుల్లో వివిధ వ్యవస్థల నిర్వహణకు అవసరమైన శిక్షణను పొందుతారని ఆర్మీ వర్గాలు వెల్లడించాయి. ఈ అయిదుగురితోపాటు ఓటీఏలో శిక్షణ పూర్తి చేసుకున్న మరో 19 మంది పురుష అధికారులను తాజాగా వేర్వేరు ప్రాంతాల్లోని ఆర్టిలరీ విభాగాల్లోకి తీసుకున్నట్లు వివరించాయి. మొదటిసారిగా ఆర్మీ 2019లో మహిళలను మిలటరీ పోలీస్ విభాగంలోకి రిక్రూట్ చేసుకుంది. ఈ ఏడాది జనవరిలో ఆర్మీ కార్ప్స్ ఇంజినీర్స్ విభాగానికి చెందిన కెప్టెన్ శివ చౌహాన్‌కు మొట్టమొదటిసారిగా ప్రపంచంలోని ఎత్తైన యుద్ధక్షేత్రంగా భావించే సియాచిన్ గ్లేసియర్‌లో ఫ్రంట్‌లైన్ బాధ్యతలు అప్పగించారు.

కేజ్రీవాల్ నివాసానికి మరమ్మతులపై నివేదిక కోరిన ఎల్జీ

న్యూఢిల్లీ: ఢిల్లీ సీఎం కేజ్రీవాల్ అధికార నివాసానికి రూ.49 కోట్లతో చేయించిన మరమ్మతుల్లో అవకతవకలు జరిగాయంటూ వచ్చిన వార్తలపై ఢిల్లీ లెఫ్టినెంట్ గవర్నర్ వీకే సక్సేనా స్పందించారు. దీనిపై సవివర నివేదిక ఇవ్వాలని, మరమ్మతులకు సంబంధించిన అన్ని రికార్డులను 15 రోజుల్లోగా తన ముందుంచాలని శనివారం చీఫ్ సెక్రటరీని ఆదేశించారు. 2020–22 సంవత్సరాల్లో అధికార నివాసంలో అదనపు పనులు, మరమ్మతుల కోసం కేటాయింపులు రూ43.70 కోట్లు కాగా, రూ.44.78 కోట్లు వెచ్చించినట్లు రికార్డులు చెబుతున్నాయి. సమస్యల నుంచి ప్రజలను తప్పుదోవ పట్టించేందుకే అవకతవకలు జరిగాయంటూ బీజేపీ ఆరోపణలు చేస్తోందని ఆప్ అంటోంది.

కడ్తా పేరుతో దోపిడీని సహించం

- తడిసిన ధాన్యాన్ని బాయిల్డ్ మిల్లులకు తరలిస్తున్నాం
- కలెక్టర్ రాజీవ్‌గాంధీ హనుమంతు



రిటైర్డ్ పశువైద్యులను సన్మానిస్తున్న కలెక్టర్

సుభాష్‌నగర్ : వర్షాలతో తడిసిన ధాన్యాన్ని కడ్తా పేరుతో రైస్‌మిల్లర్లు దోపిడీకి పాల్పడితే కఠినచర్యలు తీసుకుంటామని కలెక్టర్ రాజీవ్‌గాంధీ హనుమంతు హెచ్చరించారు. ఆదివారం కలెక్టరేట్‌లో మాట్లాడుతూ యాసంగి 2022–23 సీజన్‌లో ఇప్పటివరకు 406 కేంద్రాల ద్వారా 20,239 మంది రైతుల నుంచి 1,64,656 మెట్రిక్ టన్నుల ధాన్యం కొనుగోలు చేసి రైస్‌మిల్లులకు తరలించామన్నారు. గ్రామ, మండల, డివిజన్, జిల్లాస్థాయిలో కమిటీలు ఏర్పాటుచేసి క్షేత్రస్థాయి సమస్యలను ఎప్పటికప్పుడు పరిష్కరిస్తున్నామన్నారు. ఈ విషయంలో ప్రభుత్వం చొరవ చూపుతూ తడిచిన ధాన్యాన్ని బాయిల్డ్ మిల్లులకు తరలించేలా ఆదేశాలు జారీ చేసిందన్నారు. ఇప్పటికే 25 ట్రక్కుల తడిచిన ధాన్యాన్ని మిల్లులకు తరలించామని, రైతులు ఎలాంటి ఆందోళనకు గురికాకుండా సంయమనం పాటించాలని కోరారు. ఇదే అదనుగా తీసుకుని నాణ్యమైన ధాన్యాన్ని కూడా రైస్‌మిల్లర్లు దించుకునేందుకు ఇబ్బందులకు గురిచేస్తున్నారని, అలాంటి రైస్‌మిల్లులను గుర్తించాలని పౌరసరఫరాల శాఖ అధికారులను ఆదేశించామని తెలిపారు. డీపీఎంలు ఎంట్రీలను వేగవంతం చేసి ధాన్యం డబ్బులు జమ చేయాలని సూచించామన్నారు. ట్రాన్స్‌పోర్ట్ కాంట్రాక్టర్లు ఎప్పటికప్పుడు లారీలను పంపిస్తూ ధాన్యం తరలించాలని రవాణాశాఖ డిప్యూటీ కమిషనర్‌ను ఆదేశించామని పేర్కొన్నారు. గన్నీ బ్యాగుల కొరత లేకుండా చర్యలు తీసుకోవాలని డీఎంకు సూచించామని కలెక్టర్ తెలిపారు.

గొర్రెల పంపిణీ పథకంపై అవగాహన ఉండాలి

సుభాష్‌నగర్ : ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా అమల్జేస్తున్న గొర్రెల పంపిణీ పథకం అమలు తీరుపై పూర్తి అవగాహన ఏర్పర్చుకోవాలని కలెక్టర్ రాజీవ్ గాంధీ హనుమంతు సూచించారు. కలెక్టరేట్‌లో శనివారం పశు సంవర్ధక శాఖ ఆధ్వర్యంలో మండల ప్రత్యేక అధికారులు, వెటర్నరీ అధికారులకు అవగాహనా కార్యక్రమం నిర్వహించారు. రెండో విడత గొర్రెల పంపిణీ పథకం అమలులో పాటించాల్సిన పద్ధతులు, యూనిట్ విలువ, లబ్ధిదారుల ఎంపిక ప్రక్రియ, గొర్రెల సేకరణ, వాటి బీమా, రవాణా, వ్యాధుల నివారణకు పాటించాల్సిన జాగ్రత్తలు, ఆదాయం పెంపు మార్గాలు తదితర అంశాలపై పవర్ పాయింట్ ప్రజంటేషన్ ద్వారా స్పష్టమైన అవగాహన కల్పిస్తూ, సందేహాలు నివృత్తి చేశారు.

ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ జిల్లాలో రెండో విడతలో 8,384 మంది లబ్ధిదారులను ఎంపిక చేయాల్సి ఉందన్నారు. మొదటి విడతలో ఒక్కో యూనిట్ విలువ రూ. 1.25 లక్షలు ఉండగా, ప్రస్తుతం రూ. 1.75 లక్షలకు పెంచిందన్నారు. ఇందులో ప్రభుత్వం 75 శాతం సబ్సిడీ కింద రూ.1,31,250 లను సమకూరుస్తుండగా, లబ్ధిదారులు తమ వాటాగా 25శాతం నిధులు రూ.43,750 డీ.డీ రూపంలో చెల్లించాల్సి ఉంటుందన్నారు. లాటరీ విధానం ద్వారా లబ్ధిదారులను ఎంపిక చేస్తామని కలెక్టర్ స్పష్టంచేశారు. ప్రపంచ పశువైద్య దినోత్సవం సందర్భంగా జిల్లా కలెక్టర్ రాజీవ్ గాంధీ హనుమంతు ఆధ్వర్యంలో రిటైర్డ్ పశువైద్యులు గురువారెడ్డి, ఖాదీర్ అహ్మద్, పశు వైద్య పట్టభద్రురాలు జయసుధ (డీపీవో)ను సత్కరించారు. కార్యక్రమంలో జిల్లా పశువైద్యాధికారి డాక్టర్ వి జగన్నాథ చారి, సహాయ సంచాలకులు బాలిగ్ అహ్మద్, మండల స్పెషల్ ఆఫీసర్లు, పశు సంవర్ధక శాఖ అధికారులు పాల్గొన్నారు.

హాకీ ఆణిముత్యాలు

- క్రీడలో రాణిస్తున్న తూంపల్లి జడ్పీహెచ్ఎస్ విద్యార్థులు
- రాష్ట్ర, జాతీయ స్థాయి క్రీడా పోటీల్లో ప్రాతినిధ్యం
- జిల్లా జట్టు ఎంపికలో వారిదే సింహభాగం
- సాయ్ హాకీ అకాడమీ, స్పోర్ట్ అథారిటీ ఆఫ్ తెలంగాణ హాకీ అకాడమీలో సీట్లు

ఆ పాఠశాల మైదానం ఉదయం, సాయంత్రం వేళల్లో సందడిగా మారుతుంది. హాకీ క్రీడాకారులకు వేదికవుతుంది. జట్లుగా విడిపోయి హోరాహోరీగా తలపడతారు. అక్కడి వాతావరణం హాకీ పోటీలను తలపిస్తుంది. ఇది ప్రతినిత్యం ఆ పాఠశాల విద్యార్థులు చేసే ప్రాక్టీస్ తీరు. ఈ కఠోరమైన శ్రమ వల్లే హాకీ క్రీడలో సిరికొండ మండలం తూంపల్లి పాఠశాల జట్టు ప్రత్యేక స్థానాన్ని పొందింది. ఆ పాఠశాలలో హాకీ స్టిక్ పట్టని విద్యార్థి ఉండటంటే అతిశయోక్తి కాదు. బాలురతో పాటు బాలికలు సమానంగా హాకీలో రాణించడం విశేషం. – నిజామాబాద్ డెస్క్



జాతీయ స్థాయి హాకీ పోటీ, కు ఎంపికైన మలావత్ మమత, బనావత్ వెన్నెల



యూనివర్సిటీ నేషనల్స్‌కు ఎంపికైన విద్యార్థులు

నిజామాబాద్ డెస్క్ : రాష్ట్ర స్థాయి హాకీ పోటీలకు జిల్లా జట్టు ఎంపికయ్యిందంటే సిరికొండ మండలం తూంపల్లి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల విద్యార్థుల ప్రాతినిధ్యం ఉండాల్సిందే. మొత్తం 18 మంది జట్టు సభ్యుల్లో 12 నుంచి 14 మంది వారే ఉంటారు. జట్టు విజయంలో కీలక పాత్ర పోషిస్తారు.

ఇక జిల్లా స్థాయి పోటీలు జరిగాయంటే ప్రథమ, ద్వితీయ స్థానాలు దాదాపుగా ఖాయం. రాష్ట్ర, జాతీయ స్థాయి హాకీ పోటీల్లోనూ రాణిస్తున్నారు. రాష్ట్ర స్థాయి పోటీలలో ఇప్పటి వరకు 250 మంది, జాతీయ స్థాయి పోటీల్లో 70 మంది వరకు ప్రాతినిధ్యం వహించారు. సాయ్ (స్పోర్ట్ అథారిటీ ఆఫ్ ఇండియా హాకీ అకాడమీ)కి ఇప్పటి వరకు ఈ పాఠశాల నుంచి ఏడుగురు విద్యార్థులు ఎంపికయ్యారు. ప్రస్తుతం నలుగురు బాలికలు, బాలుడు అకాడమిలో శిక్షణ పొందుతున్నారు. స్పోర్ట్ అథారిటీ ఆఫ్ తెలంగాణ హాకీ అకాడమీలో ఇద్దరు బాలురు ఉన్నారు. అండర్ 14 విభాగం నుంచి యూనివర్సిటీ విభాగం వరకు అన్ని కేటగిరిలలో జాతీయస్థాయిలో ప్రాతినిధ్యం వహించారు.



రాష్ట్రస్థాయి హాకీ పోటీలకు తుంపల్లిలో నిర్వహించిన క్యాంపులో విద్యార్థులు

విద్యార్థుల విజయాల సారథి..

హాకీ క్రీడలో తూంపల్లి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల విద్యార్థుల విజయాల వెనుక పీఈటీ సడక్ నగేశ్ కృషి ఎంతో ఉంది. ఎనిమిదేళ్ల క్రితం ఈ పాఠశాలకు ఈయన బదిలీపై వచ్చారు. అప్పటి వరకు విద్యార్థులు కబడ్డీ, ఖోఖో, వాలీబాల్ ఆడేవారు. నగేశ్ వెళ్లిన తర్వాత విద్యార్థులకు హాకీ క్రీడపై మక్కువ కలిగింది. ఈయన శిక్షణలో మెరుగైన క్రీడాకారులుగా ఎదిగారు. ఏడాదిలోనే మంచి టీమ్ తయారైంది. పాఠశాల జట్టు ఫలితాలను రాబట్టం ప్రారంభించింది. జిల్లా స్థాయిలో ఏ టోర్నమెంట్ జరిగినా ఈ పాఠశాల జట్టు ఫస్ట్ ప్లేస్ రావడం ప్రారంభమైంది. రాష్ట్ర స్థాయి జట్టుకు విద్యార్థులు ఎంపిక కావడం మొదలైంది. రాష్ట్రస్థాయి పోటీల్లో ఇప్పటి వరకు రెండు వందల సార్లు విద్యార్థులు ప్రాతినిధ్యం వహించారు. పాఠశాలలో 170 మంది విద్యార్థులు ఉన్నారు. అందరు పిల్లలూ హాకీ ఆడతారు.



పీఈటీ సడక్ నగేశ్



సీఎం అసమర్థత వల్లే రైతులకు అధోగతి

ఎంపీ అర్వింద్ విమర్శ



ఫత్తేపూర్‌లో పంటలను పరిశీలిస్తున్న ఎంపీ అర్వింద్

పెర్కిట్(ఆర్మూర్) : తెలంగాణలో సీఎం కేసీఆర్ అసమర్థత పాలన వల్లే రైతులు అధోగతి పాలవుతున్నారని ఎంపీ అర్వింద్ ఆరోపించారు. అకాల వర్షాలకు ఆర్మూర్ మండలం పిప్రి, ఫత్తేపూర్ గ్రామాల్లో నష్టపోయిన వరి, నువ్వుల పంటలను ఎంపీ అర్వింద్ శనివారం పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సొంత రాష్ట్రంలో రైతాంగాన్ని గాలికొదిలేసి 'అబ్ కీ బార్ కిసాన్ సర్కార్' అంటూ సభలు నిర్వహిస్తూ సీఎం దేశం మీద పడ్డారని ఎద్దేవా చేశాడు. సీఎం కేసీఆర్‌కు తన పిల్లలపై ఉన్న కేసులపై ఉన్న ఆందోళనే తప్ప తెలంగాణ రైతాంగంపై శ్రద్ధ లేదన్నారు. మధ్యప్రదేశ్, హర్యాణ, మహారాష్ట్రలో ఫసల్ బీమా యోజన పథకం అమలు చేస్తూనే పంటలు నష్టపోయిన రైతులకు ఎకరాకు రూ.10 నుంచి 15 వేల నష్ట పరిహారం అందజేస్తున్నారన్నారు. కాని తెలంగాణలో మాత్రం ఫసల్ బీమా అమలు చేయకపోగా రాష్ట్రం తరపున కూడా నష్టపరిహారం ఇవ్వకపోవడం బీఆర్ఎస్ ప్రభుత్వానికే చెల్లిందన్నారు. ప్రభుత్వం తరపున టార్పాలిన్లు కూడా ఇవ్వకపోవడంతో రైతులు నష్టపోయారన్నారు. నిజామాబాద్ పార్లమెంట్ నియోజకవర్గం పరిధిలో 40 వేల ఎకరాల్లో 33 శాతం పంటకు నష్టం జరిగిందని ఎకరాలకు రూ.50 వేల పరిహారం అందజేయాలని ఎంపీ డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో బీజేపీ రాష్ట్ర నాయకుడు పల్లె గంగా రెడ్డి, జిల్లా ప్రధాన కార్యదర్శి జీవీ నర్సింహారెడ్డి, కిసాన్ మోర్చా జిల్లా అధ్యక్షుడు శ్రీనివాస్ రెడ్డి తదితరులున్నారు.



నేడు కానిస్టేబుల్ రాత పరీక్ష

నేడు జరుగనున్న పోలీస్ కానిస్టేబుల్ ఉద్యోగాల నియామక తుది పరీక్షకు పోలీసు యంత్రాంగం ఏర్పాట్లు చేసింది.

- 6లో ▸



ముప్పై నుంచి వంద పడకలకు!

దోమకొండ క్లస్టర్ ఆస్పత్రిని వంద పడకలకు పెంచేందుకు కసరత్తు మొదలైంది. ఈ మేరకు వైద్యవిధాన పరిషత్ నివేదిక కోరింది.

- 7లో ▸

గరిష్టం/కనిష్టం
30.4 /22.0

వాతావరణం

ఉదయం ఎండ కాస్తుంది. మధ్యాహ్నం ఆకాశం మేఘావృతమవుతుంది. సాయంత్రం అక్కడక్కడ వర్షం కురిసే అవకాశాలున్నాయి.

న్యూస్‌రీల్

ఎమ్మెల్యేల అవినీతిపై సిట్ విచారణ చేపట్టాలి

కామారెడ్డి టౌన్: రాష్ట్రంలో దళిత బంధు పథకంలో బీఆర్ఎస్ ఎమ్మెల్యేలు అవినీతికి పాల్పడ్డారని స్వయంగా సీఎం కేసీఆరే అన్నారని, తక్షణమే వారిపై సిట్ విచారణ చేపట్టాలని మాజీ మంత్రి షబ్బీర్‌అలీ డిమాండ్ చేశారు. శనివారం ఆయన నివాసంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో మాట్లాడారు. ఎమ్మెల్యేల చిట్టా తన వద్ద ఉందని, రూ. 3లక్షల వరకు ఒక్కో ఎమ్మెల్యే దళితుల నుంచి వసూలు చేశారని సీఎం ప్రకటించడం ప్రభుత్వం ఎలా అవినీతి చేస్తుందో ప్రజలకు అర్థం అవుతుందన్నారు. రాష్ట్రంలో బీఆర్ఎస్ ఎమ్మెల్యేలు 30శాతం కమీషన్ల ద్వారా రాష్ట్రాన్ని దోచుకున్నారని ఆరోపించారు. కాంగ్రెస్ ప్రభుత్వం రాగానే సీఎం, బీఆర్ఎస్ ఎమ్మెల్యేలపై విచారణ జరిపిస్తామన్నారు. బహిరంగంగా అవినీతి పాల్పడ్డామని చెప్పుకునే ప్రభుత్వాన్ని చూడడం మన దౌర్భాగ్యమన్నారు.

యూడైస్ వివరాలను అప్‌డేట్ చేయండి



ఎల్లారెడ్డి: పాఠశాలలకు సంబంధించిన యూడైస్ వివరాలను ఆన్‌లైన్‌లో అప్‌డేట్ చేయాలని డీఈవో రాజు సూచించారు. శనివారం ఎంపీడీవో కార్యాలయంలో ఎల్లారెడ్డి, నాగిరెడ్డిపేట, నిజాంసాగర్, పిట్లం, బిచ్కుంద, జుక్కల్, మద్నూర్, బాన్సువాడ, నస్రుల్లాబాద్, బీర్కూర్ మండలాల సీఆర్పీలు, కంప్యూటర్ ఆపరేటర్లతో సమావేశం నిర్వహించారు. పాఠశాలలకు సంబంధించి యూడైజ్‌లో ఉన్న తప్పులను సరిదిద్దాలన్నారు. వివరాల అప్‌డేట్ వేగవంతం చేయాలని సూచించారు. కార్యక్రమంలో సెక్టోరియల్ అధికారులు, ఎంఈవో వెంకటేశం తదితరులు పాల్గొన్నారు.

నవోదయ పరీక్ష కేంద్రం పరిశీలన

ఎల్లారెడ్డిరూరల్: ఎల్లారెడ్డిలో ఏర్పాటు చేసిన నవోదయ పరీక్ష కేంద్రాన్ని డీఈవో రాజు శనివారం పరిశీలించారు. పట్టణంలోని జీవదాన్ పాఠశాలలో ఏర్పాటు చేసిన ఏ, బీ పరీక్షా కేంద్రాలను ఆయన పరిశీలించారు. కార్యక్రమంలో ఎంఈవో వెంకటేశం, పరీక్షా కేంద్రాల చీఫ్ సూపరింటెండెంట్‌లు చిరంజీవులు, మాణిక్యం తదితరులు పాల్గొన్నారు.

వెంచర్‌ను పరిశీలించిన అడిషనల్ కలెక్టర్



బాన్సువాడ : బాన్సువాడ మున్సిపల్ పరిధిలో బస్‌డిపో వెనుకాల ఏర్పా టు చేసిన వెంచర్‌ను శనివారం అడిషనల్ కలెక్టర్ వెంకటేశ్ ధోత్రే, ట్రెయినీ కలెక్టర్ శివేంద్ర ప్రతాప్‌లు పరిశీలించారు. బఫర్ జోన్, రోడ్ల విస్తీర్ణం, పదిశాతం స్థలం మున్సిపల్‌కు కేటాయించారా లేదా అనే విషయాలపై కమిషనర్ రమేశ్‌ను అడిగి తెలుసుకున్నారు. వెంచర్‌లో మొక్కలు తప్పనిసరిగా నాటేలా చర్యలు తీసుకోవాలని సూచించారు. అనంతరం వైకుంఠధామం పనులను పరిశీలించారు. పనులు వేగవంతం చేయాలని సూచించారు. వారి వెంట టౌన్ ప్లానింగ్ అధికారి భూపతి, సిబ్బంది తుల శ్రీనివాస్ ఉన్నారు.

కుల వృత్తులతో స్వయం ఉపాధి పొందాలి




దోమకొండ: కుల వృత్తుల ద్వారా కుమ్మరులు స్వయం ఉపాధిని పొందాలని నాబార్డు సీజీఎం శ్రీనివాసులు అన్నారు. శనివారం దోమకొండలోని జేఎస్ ఫంక్షన్‌హాల్‌లో కుమ్మరుల సంఘం సమావేశం నిర్వహించగా ఆయన మాట్లాడారు. కుమ్మరి కుల వృత్తి ఉత్పత్తులు, వాటి నిర్వహణను ప్రోత్సహించడానికి నాబార్డు ద్వారా రూ. 50లక్షలు గ్రాంట్ మంజూరు చేస్తున్నట్లు వివరించారు. కుమ్మరులు కుండలు, ఇతర సామాగ్రిని ఆధునిక పద్ధతుల ద్వారా తయారు చేసి, స్వయం ఉపాధి పొందాలని సూచించారు. సమావేశంలో నాబార్డు ఏజీఎం పియూష్, ఎస్ఐడీజీ గంగాధర్, జెడ్పీటీసీ సభ్యులు తీగల తిర్మల్‌గౌడ్, ఎంపీపీ శారద, సర్పంచ్ నల్లపు అంజలి, బీఆర్ఎస్ మండలాధ్యక్షుడు మధుసూదన్‌రావ్ పాల్గొన్నారు.

ఆ ఊరే ఓ సైన్యం!

- ఇప్పటికే 25 మంది సైనికులు
- అదే బాటలో మరికొందరు
- దేశ సేవకు అంకితమవుతున్న యువత
- ఆదర్శం తాడ్వాయి



ఆకిటి ప్రశాంత్‌రెడ్డి (అస్సాం)




తాడ్వాయి గ్రామం



పీసు సంజీవరెడ్డి(అరుణాచల్‌ప్రదేశ్)



తానయ్యోల ప్రదీప్‌రావ్(జమ్మూ)



మర్రి ప్రశాంత్ (ఢిల్లీ)



గుట్టకాడి సంజీవరెడ్డి(జమ్మూకాశ్మీర్)



లింగపోల మనోజ్(అరుణాచల్‌ప్రదేశ్)



తాడ్వాయి గ్రామంలో సైనికులు ఏర్పాటు చేసిన సుభాష్ చంద్రబోస్ విగ్రహం



బేతుల రాజు (అస్సాం)



గొల్ల సంతోష్‌కుమార్ (పంజాబ్)

సండే స్పెషల్

సాక్షి, కామారెడ్డి: ఆ ఊళ్లో ఒకరిని చూసి ఒకరు అన్నట్టుగా ఇప్పటికే 25 మంది సైన్యంలో అడుగుపెట్టారు. మరికొందరు అదే బాటలో సిద్ధమవుతున్నారు. ఆటల్లో ముందుండే తాడ్వాయి యువత దేశ సేవలోనూ ముందు వరుసలో నిలుస్తున్నారు. తాడ్వాయి మండల కేంద్రంలో యువతకు దేశభక్తి ఎక్కువ. దేశ సేవ కోసం వారు త్రివిధ దళాల్లో చేరుతున్నారు. ముఖ్యంగా ఆర్మీలో చాలా మంది చేరారు. సెలవుల్లో వచ్చినపుడల్లా గ్రామానికి చెందిన యువతకు సైన్యం గురించి అవగాహన కల్పిస్తున్నారు. దీంతో యువత సైన్యంలో చేరడానికి మరింత ఆసక్తి కనబరుస్తున్నారు. కాగా గ్రామానికి చెందిన రవీందర్‌రెడ్డి అనే సైనికుడు రెండేళ్ల నాడు చనిపోయాడు. ఆర్మీలో చేరేందుకు ఆసక్తి చూపే యువతను గ్రామానికి చెందిన సైనికులు ప్రోత్సహిస్తున్నారు.

త్రివిధ దళాల్లో..

తాడ్వాయి గ్రామానికి చెందిన యువకులు త్రివిధ దళాల్లో వివిధ స్థాయిల్లో పలు రాష్ట్రాల్లో విధులు నిర్వహిస్తున్నారు. జమ్మూకాశ్మీర్, పంజాబ్, అరుణాచల్ ప్రదేశ్, అస్సాం తదితర రాష్ట్రాల్లో వారు బాధ్యతలు నిర్వహిస్తూ దేశ రక్షణలో తమవంతు పాత్ర పోశిస్తున్నారు. వివిధ స్థాయిల్లో వారు పనిచేస్తున్నారు. అంతేగాక గ్రామానికి చెందిన పలువురు పోలీసు శాఖలోనూ ఉద్యోగాల్లో ఉన్నారు.

గర్వంగా ఉంది..



నా కొడుకు సైన్యంలో చేరి దేశానికి సేవ చేస్తుండడం గర్వంగా అనిపిస్తుంది. మా గ్రామంలో యువకులు ఒకరిని నుంచి ఒకరు దేశ సేవకు అంకితమవుతున్నారు. నా కొడుకు సైన్యంలో చేరాలనుకున్నపుడు ప్రోత్సహించి పంపించాను. –తానయ్యోల బాపురావు, సైనికుడి తండ్రి, తాడ్వాయి

నేను పోలీసు కావాలనుకున్నా..



నాకు పోలీసు అవ్వాలని ఉండే. నేను కాలేకపోయాను. నా కొడుకు సైన్యంలో చేరాడు. నా కోరిక నా కొడుకు రూపంలో తీరింది. దేశ సేవ కోసం సైన్యంలో చేరడాన్ని గొప్పగా ఫీలవుతాను. చాలా మంది యువకులు సైన్యంలో చేరుతున్నారు.

– ఆకిటి రాజిరెడ్డి, సైనికుడి తండ్రి, తాడ్వాయి

మా గ్రామానికే గర్వకారణం



మా గ్రామం నుంచి 25 మంది సైన్యంలో పనిచేస్తుండడం మాకెంతో గర్వంగా ఉంది. సైన్యంలో పనిచేస్తూనే గ్రామంలో సేవా కార్యక్రమాలు కూడా చేపడుతున్నారు. వారిని చూసి గ్రామం గర్వంగా ఫీలవుతుంది. వాళ్ల దారిలో చాలా మంది నడవడానికి ముందుకు వస్తున్నారు.

–సంజీవులు, సర్పంచ్, తాడ్వాయి

గ్రామం నడిబొడ్డున సుభాష్ చంద్రబోస్ విగ్రహం

తాడ్వాయికి చెందిన సైనికులంతా కలిసి గ్రామంలో సుభాష్ చంద్రబోస్ విగ్రహాన్ని ఏర్పాటు చేశారు. మండల కేంద్రంలోని ప్రధాన కూడలి వద్ద విగ్రహాన్ని ఏర్పాటు చేసి అందరికీ స్ఫూర్తిని నింపారు. అలాగే అనేక సేవా కార్యక్రమాలు కూడా నిర్వహిస్తుంటారు. యువతను ప్రోత్సహించేందుకు వారు రకరకాల ప్రయత్నాలు చేస్తున్నారు. తాడ్వాయికి చెందిన విద్యార్థులు, యువకులు ఆటల్లో ఎంతో పేరు గడించారు. వారిలో చాలా మంది ఆర్మీలో, పోలీసు శాఖలో చేరడానికి ఆసక్తి చూపుతున్నారు.

ప్రపంచానికి అన్నం పెట్టేది అన్నదాతలే



భిక్కనూరులో మాట్లాడుతున్న హైకోర్టు న్యాయమూర్తి శ్రీసుధ

- కంప్యూటర్ రంగంతో ఆహారాన్ని తయారుచేయలేం
- హైకోర్టు న్యాయమూర్తి శ్రీ సుధ

భిక్కనూరు: ప్రకృతి కన్నెర్ర చేసినా, ఎన్ని కష్టాలు ఎదురైనా వాటిని తనలోనే దిగమింగుకుని మానవాళికి అన్నం పెట్టి బతికించేది అన్నదాతలేనని హైకోర్టు న్యాయమూర్తి శ్రీసుధ అన్నారు. శనివారం భిక్కనూరులో జిల్లా న్యాయసేవా అధికార సంస్థ ఆధ్వర్యంలో రైతు న్యాయ సలహాలు సూచన కేంద్రాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా జడ్జి మాట్లాడుతూ ప్రపంచమంతా కంప్యూటర్ రంగం అంటూ పరుగెడుతుందని.. కానీ ఈ రంగం ఆహారాన్ని తయారుచేయదన్నారు. రైతులకు మేలైన సేవలందించేందుకు కంప్యూటర్ ఉపయోగపడుతుందే తప్పా ప్రపంచానికి ఆహారాన్ని అందిచలేదనే విషయాన్ని ప్రతిఒక్కరూ గుర్తించి రైతులను గౌరవించాలన్నారు. ప్రభుత్వం రైతుల సంక్షేమం కోసం ఎన్నో పథకాలను ప్రవేశపెడుతున్నా రైతులకు పూర్తి స్థాయిలో చేరడం లేదన్నారు. రైతు తమ సమస్యల పరిష్కారానికి తీసుకోవాల్సిన చర్యలపై వారికి అవసరమైన సలహాలు సూచలను అందించేందుకు న్యాయసేవా అధికార సంస్థ ఆధ్వర్యంలో భిక్కనూరులో రైతు న్యాయ సేవా సలహాలు సూచనల కేంద్రాన్ని ప్రారంభించడం జరిగిందన్నారు. ధరణి పోర్టల్ ప్రారంభమైన తర్వాత రెవెన్యూ కోర్టులను పూర్తిగా తొలగించడం జరిగిందన్నారు. రైతులు తమకు సమస్య వస్తే ఈ కేంద్రంలోని పార వలంటీర్లను సంప్రదిస్తే సమస్య పరిష్కారం కోసం ఎవరిని సంప్రదించి ఏ విధంగా దరఖాస్తు చేసుకోవాలని సలహాలు, సూచనలు ఇస్తారన్నారు. రైతులకు నేస్తం.. న్యాయ సేవా హస్తం పేరిట కేంద్రాలను ఏర్పాటు చేయడం జరుగుతుందన్నారు. కార్యక్రమంలో జిల్లా కోర్టు న్యాయమూర్తి శ్రీదేవి, ఏడీజే లాల్‌సింగ్ శ్రీనివాస్ నాయక్, సీనియర్ సివిల్ జడ్జి కిరణ్ కుమార్, కలెక్టర్ జితేష్ వి పాటిల్, ఎస్పీ శ్రీనివాస్‌రెడ్డి, కామారెడ్డి బార్ అసోసియేషన్ అధ్యక్షుడు అతిమాములు శ్రీధర్‌గుప్తా, జిల్లా వ్యవసాయాధికారి వీరసింగ్, సర్పంచ్ తున్కి వేణు, పీపీ నంద రమేశ్, న్యాయవాదులు గజ్జెల భిక్షపతి, నరేందర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

వెన్నాడుతున్న వాన.. రైతన్న హైరానా

- అకాల వర్షంతో అన్నదాతల ఆందోళన
- మొలకలు వస్తున్న వరిధాన్యం



మహమ్మద్‌నగర్‌లో వరిధాన్యం కుప్పల చుట్టూ నిలిచిన వర్షపు నీరు

నిజాంసాగర్(జుక్కల్): నాలుగైదు రోజుల నుంచి వడగండ్లు, బలమైన గాలులు, అకాల వర్షాల ధాటికి అన్నదాతలు అవస్థలు పడుతున్నారు. నిలువ ఉన్న వడ్లు, పైర్లు నేలవాలడం, నూర్పిడి చేసిన ధాన్యాన్ని ఆరబెట్టేందుకు రైతులు అవస్థలు పడుతున్నారు. కొనుగోలు కేంద్రాల వద్ద కుప్పలు పోసిన వరిధాన్యం మొలకలు వస్తుండడంతో రైతులు ఆందోళన చెందుతున్నారు. శుక్రవారం రాత్రి, శనివారం ఉదయం జిల్లా వ్యాప్తంగా అకాల వర్షాలు దంచికొట్టాయి. ముఖ్యంగా బాన్సువాడ డివిజన్ వ్యాప్తంగా భారీ వర్షం కురవడంతో ఒర్రెలు, మడుగుల్లో వర్షపు నీరు చేరింది. జుక్కల్‌లో 2.6 సెంటీమీటర్లు, బిచ్కుందలో 3.6 సెంటీమీటర్లు, పిట్లం, పెద్దకొడప్‌గల్‌లో 1.4 సెంటీమీటర్లు, నిజాంసాగర్‌లో 2.1 సెంటీమీటర్లు, మద్నూర్‌లో 6 మిల్లీమీటర్ల వర్షం కురిసింది. అలాగే బాన్సువాడలో 2.4 సెంటీమీటర్లు, నస్రుల్లాబాద్‌లో 7 మిల్లీమీటర్లు, బీర్కూర్‌లో 5 మిల్లీమీటర్ల వర్షం కురిసింది.

రైతుల ఆందోళన

కొనుగోలు కేంద్రాల వద్ద కుప్పలు పోసిన వరిధాన్యం అకాల వర్షానికి తడిసి ముద్దవడంతో మొలకలు వస్తున్నాయని రైతులు ఆందోళన చెందుతున్నారు. పంట నూర్పిడి చేసిన ధాన్యాన్ని ఆరబెట్టలేక, మొలకలు వస్తున్నా ధాన్యాన్ని చూడలేక కంటతడి పెడుతున్నారు. అకాల వర్షాలు వెంటాడుతుండడంతో వరిధాన్యం పండించిన రైతులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు.





నర్వ శివారులో మొలకలు వచ్చిన ధాన్యం, మొలకలు వచ్చిన వడ్లను చూపిస్తున్న రైతు



మహమ్మద్‌నగర్ శివారులో వరి పొలంలో చేరిన వర్షం నీరు

వీసీ వర్సెస్ నవీన్ మిట్టల్

- రాష్ట్ర ఉన్నత విద్యాశాఖ కమిషనర్‌పై వీసీ తీవ్ర ఆరోపణలు
- నవీన్‌మిట్టల్‌పై సీఎంకు ఫిర్యాదు చేశా
- తెయూ వీసీ ప్రొఫెసర్ రవీందర్

తెయూ(డిచ్‌పల్లి): తెయూలో రోజుకోరకంగా మారుతున్న పరిమాణాలు చివరకు వీసీ వర్సెస్ నవీన్ మిట్టల్‌గా మారాయి. వీసీ ఆగడాలకు కళ్లెం వేయాలని పాలకమండలి తీసుకున్న నిర్ణయాలపై ఆయన హైకోర్టును ఆశ్రయించడంతో వర్సిటీలో విబేధాలు ముదిరి పాకానపడ్డాయి. హైకోర్టు మధ్యంతర ఉత్తర్వుల నేపథ్యంలో శనివారం ఏర్పాటుచేసిన విలేకరుల సమావేశంలో తెయూ వీసీ రవీందర్ రాష్ట్ర ఉన్నత విద్యాశాఖ కమిషనర్ నవీన్ మిట్టల్‌పై తీవ్ర ఆరోపణలు చేశారు. ఆయన చెప్పిన వారిని రిజిస్ట్రార్‌గా చేయలేదనే కోపంతో కావాలనే టార్గెట్ చేస్తున్నారని వీసీ ఆరోపించారు. రెండేళ్లుగా రూసా నిధులు రూ. 20 కోట్లు ఇవ్వకుండా ఇబ్బందులకు గురిచేస్తున్నారన్నారు. నవీన్‌మిట్టల్‌పై సీఎం కేసీ ఆర్‌కు ఫిర్యాదు చేశానని, ఆదివారం గవర్నర్ తమిళిసై, రాష్ట్ర విద్యాశాఖ మంత్రి సబితా ఇంద్రారెడ్డికి ఫిర్యాదు చేస్తానన్నారు. ఈనెల 19న ఈసీ సమావేశంలో తీసుకున్న నిర్ణయాలను వీసీగా తాను, లేదా గవర్నర్ ఆమోదించాల్సి ఉంటుందని, లేకుంటే ఆ నిర్ణయాలు చెల్లవని స్పష్టం చేశారు. దీనిపై తాను హైకోర్టును ఆశ్రయించగా తదుపరి ఉత్తర్వులు ఇచ్చే వరకు ఈసీ నిర్ణయాలను రద్దు చేస్తూ కోర్టు శుక్రవారం మధ్యంతర ఉత్తర్వులు జారీ చేసిందన్నారు. హైకోర్టు ఉత్తర్వుల ప్రకారం యాదగిరి రిజిస్ట్రార్ కుర్చీలో కూర్చోవడం చట్టరీత్యా నేరమన్నారు. యాదగిరి రిజిస్ట్రార్‌గా తప్పుకోవాలని లేదంటే అతడిపై పోలీసు కేసు నమోదు చేయిస్తామని హెచ్చరించారు. ప్రస్తుతం విద్యావర్ధిని ఇన్‌చార్జి రిజిస్ట్రార్ అని, వారం రోజుల్లో ఓయూ నుంచి ఒకరిని తెయూ రిజిస్ట్రార్‌గా నియమిస్తామన్నారు. తనపై ఏసీబీ, విజిలెన్స్ వారికి విచారణ జరిపే అధికారం లేదని వీసీ స్పష్టం చేశారు. ఈసీ సభ్యుల కమిటీ తనపై విచారణ చేయడం నిబంధనలకు విరుద్ధమన్నారు.



మాట్లాడుతున్న వీసీ రవీందర్, పాల్గొన్న విద్యావర్ధిని

మంత్రి, ఎమ్మెల్యేకు విన్నవించినా..

మంత్రి ప్రశాంత్‌రెడ్డి, ఎమ్మెల్యే బాజిరెడ్డి, ఇతర ఎమ్మెల్యేలు పట్టించుకోకపోవడంతోనే తెయూ అధ్వానంగా మారిందని వీసీ రవీందర్ పేర్కొన్నారు. తాను పలుమార్లు మంత్రి, ఎమ్మెల్యేలను కలిసి వర్సిటీ అభివృద్ధికి సహకరించాలని విన్నవించినా.. ఫలితం లేకుండా పోయిందన్నారు. కాగా వీసీ రవీందర్ విలేకరులతో మాట్లాడుతుండగా కొందరు విద్యార్థి సంఘాల నాయకులు హాల్‌లోకి చొచ్చుకొచ్చి బల్లపై ఎక్కి ఆయనకు వ్యతిరేకంగా నినాదాలు చేశారు. కొందరు అధ్యాపకులు విద్యార్థులను రెచ్చగొట్టి ఇలాంటి పనులకు పాల్పడుతున్నారని వీసీ ఆరోపించారు. ఈనెల 26న జరిగిన ఈసీ సమావేశంలో విద్యావర్ధినిని సస్పెండ్ చేస్తూ తీర్మానించిన విషయం తెలిసిందే. ఈ విషయమై విద్యావర్ధినిని ప్రశ్నించగా తనకు ఇంతవరకు ఎలాంటి సస్పెన్షన్ ఉత్తర్వులు అందలేదని, తాను యథావిధిగా విధులకు హాజరవుతున్నట్లు ఆమె తెలిపారు.

ప్రభుత్వ ఆదేశాల మేరకే..

హైకోర్టు ఉత్తర్వులు ఇంకా అధికారికంగా అందలేదు. కోర్టు ఉత్తర్వులను గౌరవిస్తాను. పాలకమండలి ఆహ్వానం మేరకే ఈనెల 19న జరిగిన ఈసీ సమావేశానికి హాజరయ్యాను. ఈసీ తీర్మానం మేరకు రిజిస్ట్రార్‌గా బాధ్యతలు నిర్వహిస్తున్నాను. ప్రభుత్వ ఆదేశాల మేరకు ప్రస్తుతం రిజిస్ట్రార్‌గా బాధ్యతలు నిర్వహిస్తున్నాను.

– యాదగిరి, రిజిస్ట్రార్

గోదావరిని తోడేస్తున్నారు

- నది నుంచి రాత్రింబవళ్లు అక్రమంగా ఇసుక రవాణా
- 'మామూలు'గా తీసుకుంటున్న అధికారులు


కందకుర్తి వద్ద ఇసుక తవ్వకాలతో గోదావరిలో ఏర్పడిన గుంతలు

రెంజల్(బోధన్): మండలంలోని కందకుర్తి గోదావరి నదిని ఇసుకాసురులు కొళ్లగొడుతున్నారు. రాత్రింబవళ్లు ఇసుకను అక్రమంగా తరలిస్తున్నారు. వారం రోజులుగా గోదావరిలో ఇసుక తోడేళ్ల బీభత్సం నడుస్తోంది. వాల్టాకు తూట్లు పొడుస్తు అక్రమార్కులు రెచ్చిపోతున్నా.. అధికార యంత్రాంగం మామూళ్ల మత్తులో నిద్రపోతున్నట్లు ఆరోపణలు వ్యక్తం అవుతున్నాయి. యథేచ్ఛగా ఇసుక దోపిడి జరుగుతున్నా.. అధికారులు అటువైపు కన్నెత్తి చూడటం లేదు. దీంతో అక్రమార్కులు 60 ట్రాక్టర్లు 6 డోజర్లతో గోదావరి నదిలోని ఇసుకను తోడేస్తున్నారు.

ధ్వంసమవుతున్న దారులు..

రాత్రింబవళ్లు ట్రాక్టర్లు, టిప్పర్ల ద్వార అక్రమంగా ఇసుకను తరలించడంతో పంటపొలాల రోడ్లు ధ్వంసమవుతున్నాయి. రైతులు చేలకు వెళ్లేందుకు ఉన్న బాటలు కనుమరుగవడంతో పాటు పంటపొలాల నుంచి అక్రమార్కులు దారులు వేసుకుని ఇసుకను తరలించడంతో రైతులు పంటలు నష్టపోతున్నారు. సాయంత్రం నుంచి తెల్లవారు వరకు ట్రాక్టర్లు, టిప్పర్ల చప్పుళ్లతో స్థానికులను కంటిమీద కునుకు లేకుండా చేస్తున్నాయి.

నదిలో భారీ గుంతలు..

ఇసుకాసురులు గోదావరిలో ఇసుక మేటలను యంత్రాలతో తవ్వి భారీ గుంతలు చేస్తున్నారు. నది ఒడ్డున భూములు కలిగిన రైతులు తమ పొలం పెట్టు ఉన్న గోదావరి నది తమదేనని దానిలో ఇసుకను తరలించుకునేందుకు వారికే పూర్తి హక్కు ఉన్నట్లు వ్యవహరిస్తున్నారు. అధికారులు అందిన కాడికి దండుకుని పట్టనట్లు వ్యవహరిస్తున్నారనే విమర్శలు ఉన్నాయి. ఫిర్యాదులు చేసేందుకు కూడా ఎవరూ ముందుకు రావడంలేదు. మొగులాపూర్ శివారుతో పాటు కందకుర్తి చుట్టుపక్కల భారీగా ఇసుక డంప్‌లు దర్శనమిస్తున్నాయి. రాత్రి సమయంలో డంప్ చేసిన నిల్వలను టిప్పర్ల ద్వార నిజామాబాద్, భైంసా, మహారాష్ట్రలకు తరలిస్తు సొమ్ము చేసుకుంటున్నారు. అధికారులు స్పందించి ఇసుక రవాణాపై చర్యలు తీసుకునాలని ప్రజలు కోరుతున్నారు.

పగలు డంపింగ్.. రాత్రి రవాణా..

కందకుర్తి వద్ద గోదావరి నదిలో నీటి ప్రవాహం నిలిచిపోయి ఇసుక మేటలు వేసింది. అడిగేవారు లేకపోవడంతో అధికార పార్టీ నాయకులు రాత్రింబవళ్లు నదిలో డోజర్ల ద్వార ఇసుకను తోడేస్తున్నారు. సమీపంలోని పంటపొలాల్లో నిల్వ చేస్తున్నారు. రైతులు అభ్యంతరం చెబితే నయానో భయానో బెదిరించి, బీభత్సం చేయడంతో వారు మిన్నకుండిపోతున్నారు. కందకుర్తిలోని మొగులాపూర్ శివారులో ఇసుక మాఫియా డంపులు ఏర్పాటు చేసుకుని గోదావరి నుంచి నిత్యం ఇసుకను ఒడ్డుకు చేరుస్తు తమ వ్యాపారాన్ని మూడు పువ్వులు ఆరు కాయలుగా సాగిస్తున్నారు.

క్లుప్తంగా

ఆంగ్లంలో శ్రీనివాస్‌రాజ్‌కు డాక్టరేట్



తెయూ(డిచ్‌పల్లి): తెలంగాణ యూనివర్సిటీ ఆంగ్ల విభాగం పరిశోధక విద్యార్థి భట్టు శ్రీనివాస్‌రాజ్ పీహెచ్‌డీ సాధించారు. ఉస్మానియా యూనివర్సిటీ అసోసియేట్ ప్రొఫెసర్ సవీన్ పర్యవేక్షణలో 'మార్జినలైజేషన్ ఇన్ ద సెలెక్ట్ ప్లేస్ ఆఫ్ మహేష్ దత్తాని అండ్ గిరీష్ కర్నాడ్' అనే అంశంపై శ్రీనివాస్‌రాజ్ సిద్ధాంత గ్రంథాన్ని సమర్పించారు. శనివారం తెయూ ఆర్ట్స్ అండ్ సైన్స్ కాలేజీలో నిర్వహించిన వైవాకు హైదరాబాద్ సెంట్రల్ యూనివర్సిటీ ప్రొఫెసర్ బి.కృష్ణయ్య ఎక్స్‌టర్నల్ ఎగ్జామినర్‌గా వ్యవహరించారు. కార్యక్రమంలో తెయూ ఆంగ్ల విభాగాధిపతి సమత, అధ్యాపకులు రమణాచారి, లక్ష్మణ చక్రవర్తి, స్వామి పాల్గొన్నారు. శ్రీనివాస్‌రాజ్ రుద్రూర్ ఆదర్శ పాఠశాలలో పీజీటీగా విధులు నిర్వహిస్తున్నారు.

జాతీయస్థాయి పోటీలకు ఎంపిక



సుభాష్‌నగర్: రాష్ట్ర మహిళా విశ్వవిద్యాలయం (ఉమెన్స్ కళాశాల, కోఠి) మైదానంలో 23న జరిగిన మహిళల సాఫ్ట్‌బాల్ పోటీల్లో జిల్లా క్రీడాకారులు ఉత్తమ ప్రతిభ కనబర్చి జాతీయ పోటీలకు ఎంపికయ్యారని సాఫ్ట్‌బాల్ అసోసియేషన్ అధ్యక్షుడు ప్రభాకర్‌రెడ్డి, ప్రధాన కార్యదర్శి గంగామోహన్ శనివారం తెలిపారు. మే 1 నుంచి 3 వరకు గోవాలో జరిగే పోటీల్లో వీరు పాల్గొంటారని పేర్కొన్నారు. జట్టుకు కోచ్, అసిస్టెంట్ కోచ్‌లుగా శ్రీకాంత్, నాగరాజ్ (హైదరాబాద్), సాయి (రంగారెడ్డి) వ్యవహరిస్తారన్నారు.

ఎంపికైన క్రీడాకారులు

లకావత్ రాణి (సుద్దపల్లి గురుకుల కళాశాల), అజ్మీర ఇందు (పోచంపాడు గురుకుల కళాశాల), గుగులోత్ మమత (బోనగిరి గురుకుల డిగ్రీ కళాశాల), దాసరి సరియు (ధర్మారం గురుకుల పాఠశాల).

బొమ్మన్‌దేవ్‌పల్లిలో కార్డన్‌సెర్చ్



నస్రుల్లాబాద్: మండలంలోని బొమ్మన్‌దేవ్‌పల్లిలో శనివారం రాత్రి పోలీసులు కార్డన్ సెర్చ్ కార్యక్రమం నిర్వహించారు. పత్రాలు సరిగ్గా లేని 60 ద్విచక్ర వాహనాలను సీజ్ చేసినట్లు సీఐ మురళి తెలిపారు. అనంతరం గ్రామంలో ఏర్పాటు చేసిన అవగాహన సదస్సులో మాట్లాడుతూ.. రోడ్డు భద్రతా నియమాలను పాటించాలన్నారు. ఎస్సై రంజిత్‌రెడ్డి, సర్పంచ్ సత్యనారాయణ, ఎంపీటీసీ నారాయణరెడ్డి, పవన్‌గౌడ్, సాయిలు, గంగారాం పాల్గొన్నారు.

అవినీతి వీసీపై చర్యలు తీసుకోవాలి


విద్యార్థి నాయకులను అదుపులోకి తీసుకుంటున్న పోలీసులు


మెయిన్ గేట్ ఎదుట వీసీ, ప్రభుత్వ దిష్టిబొమ్మ దహనం చేస్తున్న ఎన్ఎస్‌యూఐ నాయకులు

తెయూ(డిచ్‌పల్లి): అవినీతి, అక్రమాలకు పాల్పడుతున్న తెలంగాణ యూనివర్సిటీ వీసీ రవీందర్‌పై ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని విద్యార్థి సంఘాల నాయకులు డిమాండ్ చేశారు. శనివారం వీసీ రవీందర్ విలేకరుల సమావేశంలో మాట్లాడుతుండగా ఏబీవీపీ, పీడీఎస్‌యూ విద్యార్థి నాయకులు అడ్డుకున్నారు. వీసీగో బ్యాక్, వీసీ డౌన్ డౌన్ అంటూ నినాదాలు చేస్తూ టేబుల్‌పై ఎక్కి నిరసన వ్యక్తం చేశారు. వెంటనే పోలీసులు వచ్చి విద్యార్థి నాయకులు హాల్ బయటకు లాక్కెళ్లారు. అనంతరం హాల్ బయట బైఠాయించి ధర్నా నిర్వహించారు. విద్యార్థి సంఘాల నాయకులు మాట్లాడుతూ.. ప్రభుత్వ అనుమతి లేకుండా కొనుగోళ్లు, చెల్లింపుల పేరిట వీసీ కోట్లాది రూపాయల నిధులను దుర్వినియోగం చేశారని ఆరోపించారు. ఈ సందర్భంగా విద్యార్థి నాయకులకు పోలీసులకు మధ్య తోపులాట జరిగింది. పోలీసులు విద్యార్థి సంఘాల నాయకులు సంతోష్, శివ, రాజేశ్వర్‌ను అరెస్ట్ చేశారు. నిరసనలో నవీన్, సాయికృష్ణ, శివ సాయి, అక్షయ్, అశ్విత్, మణికంఠ పాల్గొన్నారు.

వీసీని బర్తరఫ్ చేయాలి

అవినీతి అక్రమాలకు పాల్పడుతున్న వీసీ రవీందర్‌ను వెంటనే బర్తరఫ్ చేయాలని ఎన్ఎస్‌యూఐ జిల్లా అధ్యక్షుడు వేణురాజ్ డిమాండ్ చేశారు. శనివారం సాయంత్రం తెయూ మెయిన్ గేటు ఎదుట వీసీ రవీందర్, రాష్ట్ర ప్రభుత్వ దిష్టిబొమ్మను దహనం చేశారు. నిఖిల్ రెడ్డి, ఇంజమామ్, సయ్యద్ అష్రాఫ్, శివ, సాయి, సందీప్ రెడ్డి, అభిలాష్, రాహుల్ పాల్గొన్నారు.

వివాదాస్పద స్థలం పరిశీలన



సుభాష్‌నగర్: నగరంలోని అర్సాపల్లి శివారులో సర్వే నంబర్లు 213, 214లో వివాదాస్పదంగా మారిన స్థలాన్ని సర్వే అండ్ ల్యాండ్ రికార్డ్ ఏడీ శ్యాంసుందర్‌రెడ్డి, పోలీసులు శనివారం పరిశీలించారు. రెండు సర్వే నంబర్ల మధ్య హద్దుల వివాదం నెలకొంది. సమస్యను అధికారులు పరిష్కరించకపోవడంతో అయేషా ఫాతిమా లోకాయుక్తను ఆశ్రయించింది. లోకాయుక్త ఆదేశాల మేరకు అధికారులు స్థలాన్ని పరిశీలించి విచారణ చేపట్టారు. అయేషా ఫాతిమా మాట్లాడుతూ సర్వే అండ్ ల్యాండ్ రికార్డ్ ఏడీ భూమి సర్వే చేపట్టకుండా సెటిల్‌మెంట్ చేసుకోవాలని సలహాలు ఇస్తున్నారని ఆగ్రహం వ్యక్తంచేశారు. అనంతరం ఇదేవిషయమై కలెక్టరేట్‌కే ఏవోకు వినతిపత్రం అందజేశారు.

సదరం క్యాంపులు ఖరారు

డొంకేశ్వర్(ఆర్మూర్): జిల్లాలో మే 10, 17, 24 తేదీల్లో సదరం క్యాంపులు నిర్వహించనున్నట్లు జిల్లా గ్రామీణాభివృద్ధి శాఖ అధికారి చందర్ నాయక్ ఒక ప్రకటనలో తెలిపారు. క్యాంపులకు హాజరయ్యే దివ్యాంగులు మే 2 నుంచి మీ సేవా కేంద్రాల్లో స్లాట్ బుక్ చేసుకోవాలన్నారు.

నేడు కానిస్టేబుల్ ఫైనల్ రాత పరీక్ష

- నిమిషం ఆలస్యమైనా అనుమతి లేదు
- ఉదయం 9 గంటల నుంచే పరీక్ష కేంద్రాలకు రావాలని సూచన
- జిల్లాలో 12 సెంటర్లు, 5,285 మంది అభ్యర్థులు


ఎస్ఆర్ కాలేజీలో నంబర్లు వేస్తున్న సిబ్బంది

ఖలీల్‌వాడి : నేడు జరుగనున్న పోలీస్ కానిస్టేబుల్ ఉద్యోగాల నియామక తుది పరీక్షకు పోలీసు యంత్రాంగం పకడ్బందీగా ఏర్పాట్లు చేశారు. ఉదయం 10 గంటల నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకు పరీక్ష నిర్వహించనున్నారు. ఉమ్మడి జిల్లాలో 640 పోస్టులు సివిల్, ఏఆర్ పోస్టులతోపాటు టీఎస్ఎస్పీ, ఎస్పీఎఫ్, ఫైర్, జైళ్లశాఖ, ఎక్సైజ్, రోడ్డు ట్రాన్స్‌పోర్టు సంబంధించిన పోస్టులు ఉన్నాయి. జిల్లా కేంద్రంలోని నాగారంలో ఫిజికల్ టెస్ట్‌లోని క్వాలిఫై అయిన అభ్యర్థులకు కానిస్టేబుల్ మెయిన్స్‌కు ఇక్కడ అవకాశం కల్పించారు. దీంతో ఉమ్మడి జిల్లా అభ్యర్థులతో పాటు ఇతర జిల్లాలకు చెందిన అభ్యర్థులు పరీక్షలు రాయనున్నట్లు తెలిసింది.

తెలంగాణ రాష్ట్ర పోలీస్ రిక్రూట్‌మెంట్ బోర్డు కానిస్టేబుల్ మెయిన్స్‌ను ఉమ్మడి జిల్లా కేంద్రం పరిధిలో జిల్లా కేంద్రంలోనే పరీక్ష కేంద్రాలు ఏర్పాటు చేయాలని నిర్ణయించింది. అందులో భాగంగా నిజామాబాద్ పోలీస్ కమీషనరేట్ పరిధిలో 12 కేంద్రాలలో 5,285 మంది అభ్యర్థులు తుది రాత పరీక్ష రాసేందుకు ఏర్పాటు చేసింది. ఒక పరీక్ష కేంద్రంలో 440 నుంచి 442 మంది వరకు అభ్యర్థులు పరీక్ష రాయనున్నారు. అభ్యర్థులు పరీక్ష కేంద్రాలకు ఉదయం 9 గంటల నుంచి వెళ్లేందుకు అవకాశం ఉంది. ఈ పరీక్ష ఉదయం 10 గంటల నుంచి మధ్యాహ్నం 1 గంట వరకు జరగనున్నాయి.

పటిష్టమైన బందోబస్తు

జిల్లా కేంద్రంలో జరిగే పోలీస్ కానిస్టేబుల్ పరీక్షలకు 12 పరీక్ష కేంద్రాల వద్ద బందోబస్తు ఏర్పాటు చేసినట్లు ఏసీపీ కిరణ్‌కుమార్ తెలిపారు. ఇన్‌ఛార్జ్ సీపీ ప్రవీణ్‌కుమార్ పర్యవేక్షణలో 12 కేంద్రాలను మూడు సెక్టర్‌లుగా విభజించినట్లు తెలిపారు. ఒక సెక్టార్‌కు ఏసీపీ, సీఐ, ఎస్సై తోపాటు ఏఎస్సై, ముగ్గురు కానిస్టేబుల్స్, ఇద్దరు మహిళ కానిస్టేబుల్స్ బందోబస్తు నిర్వహిస్తారని తెలిపారు. పరీక్ష కేంద్రాల వద్ద 144 సెక్షన్ అమలులో ఉంటుదని తెలిపారు.

రసవత్తరంగా కుస్తీ పోటీలు



బాన్సువాడ రూరల్: మండలంలోని బోర్లం గ్రామంలో మత్తడి పోచమ్మ జాతర మహోత్సవాల్లో భాగంగా శనివారం స్థానిక జెడ్పీ హైస్కూల్ ఆవరణలో నిర్వహించిన కుస్తీ పోటీలు రసవత్తరంగా సాగాయి. వివిధ గ్రామాల నుంచి వచ్చిన మల్లయోధులు తమ ప్రతిభను చాటి నగదు బహుమతులు అందుకున్నారు. కార్యక్రమంలో గ్రామ పెద్దలు శ్రీనివాస్‌రెడ్డి, మంద శ్రీనివాస్, మమ్మాయి కాశీరాం, గోపన్‌పల్లి సాయిలు, రవీందర్‌రెడ్డి, వెంకాగౌడ్, విఠల్‌రెడ్డి, మోహన్‌రెడ్డి, వడ్ల లక్ష్మన్, జీవన్ పాల్గొన్నారు.

జేఈఈ మెయిన్స్‌లో కాకతీయ విద్యార్థుల ప్రతిభ


విద్యార్థులను అభినందిస్తున్న కళాశాల డైరెక్టర్


సిద్ధార్థ


సాయిఅక్షయ్


సాత్విక్

నిజామాబాద్ అర్బన్: జేఈఈ మెయిన్స్ ఫలితాల్లో కాకతీయ కళాశాల విద్యార్థులు సత్తా చాటారు. శనివారం వెలువడిన ఫలితాల్లో వీరు జిల్లా స్థాయిలో మొదటి, రెండు, మూడో ర్యాంకు సాధించారు. కళాశాలకు చెందిన 51మంది విద్యార్థులు అత్యుత్తమ మార్కులు సాధించినట్లు కళాశాల చైర్‌పర్సన్ విజయలక్ష్మి తెలిపారు. ఏ సిద్ధార్థ (99.77% మార్కులు) జిల్లాస్థాయి మొదటి ర్యాంకు, వి సాయిఅక్షయ్ (99.29% మార్కులు) రెండో ర్యాంకు, కె సాత్విక్ (98.73%) మూడో ర్యాంకు సాధించారని చెప్పారు. కాలేజీకి చెందిన విద్యార్థులు సాయిఅక్షయ్ ఆల్ ఇండియా ర్యాంకు 1139, సిద్ధార్థ 2681, వైష్ణవి 3445, సాత్విక్ 3516, ప్రీతి 6242, వైష్ణవి 6411, డి కళ్యాణి 7679, అస్మాఫిర్దోస్ సిద్ధికి 7707, ఎస్ఆర్ భువన కృతి 7825 ర్యాంకులు సాధించారు. కళాశాల చైర్‌పర్సన్ విజయలక్ష్మి మాట్లాడుతూ విద్యార్థులు జేఈఈ మెయిన్స్‌లో ఈ సంవత్సరం కూడా అత్యుత్తమ ర్యాంకులు సాధించడం సంతోషకరంగా ఉందన్నారు. కాకతీయ విద్యా సంస్థల డైరెక్టర్ రామోజీరావు ర్యాంకులు సాధించిన విద్యార్థులను అభినందించారు.

జేఈఈ మెయిన్స్‌లో 412 ర్యాంకు


వికాస్

కామారెడ్డి టౌన్: జేఈఈ మెయిన్స్ ఫలితాల్లో కామారెడ్డిలోని సాందీపని జూనియర్ కళాశాలకు చెందిన 10 విద్యార్థులు జేఈఈ అడ్వాన్స్‌కు అర్హత సాధించారు. ఈ ఫలితాలలో బి వికాస్ అనే విద్యార్థి ఆల్ ఇండియా 412 ర్యాంకు సాధించి ప్రతిభ చాటాడు. విద్యార్థులను కళాశాల యాజమాన్యం, డైరెక్టర్లు జనార్దన్‌రెడ్డి, పెంటయ్య, అశోక్ రావు, కృష్ణమూర్తి, హరిస్మరణ్ రెడ్డి, బాలాజీరావు, రాజేశ్వర్ రావు, ప్రిన్సిపల్ దేవేందర్ రావు అభినందించారు

ప్రాజెక్టుల నిర్మాణంలో దేశానికి ఆదర్శం తెలంగాణ

స్పీకర్ పోచారం శ్రీనివాస్‌రెడ్డి


మల్లన్న సాగర్ పనులను పరిశీలిస్తున్న స్పీకర్ పోచారం

నిజాంసాగర్: సాగునీటి ప్రాజెక్టుల నిర్మాణంలో తెలంగాణ దేశానికి ఆదర్శంగా నిలుస్తోందని స్పీకర్ పోచారం శ్రీనివాస్ రెడ్డి అన్నారు. శనివారం మల్లన్న సాగర్ టన్నెల్ పనులను జుక్కల్ ఎమ్మెల్యే హన్మంత్ సింధే, నర్సాపూర్ ఎమ్మెల్యే మదన్‌రెడ్డి, అటవీ అభివృద్ధి సంస్థ చైర్మన్ వంటేరు ప్రతాప్‌రెడ్డితో కలిసి స్పీకర్ పరిశీలించారు. మల్లన్న సాగర్ అండర్ టన్నెల్ పనులు రెండు నెలల్లో పూర్తి చేయాలని నీటిపారుదలశాఖ అధికారులు, కాంట్రాక్టర్‌ను ఆదేశించారు. ఆయన మాట్లాడుతూ మల్లన్న సాగర్ నుంచి 18 కిలోమీటర్ల టన్నెల్ గాను ఇప్పటి వరకు 13 కిలోమీటర్ల మేర పూర్తయిందన్నారు. మిగిలిన పనులను రెండు నెలల్లో పూర్తి చేసి, జులై నెలాఖరులోగా నిజాంసాగర్ ప్రాజెక్టుకు మల్లన్న సాగర్ జలాలు అందించాలని ఆదేశించారు. దేశంలో వృథాగా పోతున్న వేల టీఎంసీల నీటికి ప్రాజెక్టులు నిర్మించి ఉపయోగించుకోవాలన్నారు. మల్లన్న సాగర్ నుంచి 6 వేల క్యూసెక్కుల సామర్థ్యంతో కాలువ నిర్మాణం చేపడుతున్నట్లు పేర్కొన్నారు. ఇప్పటికే కొండపోచమ్మ సాగర్ ద్వారా వెయ్యి క్యూసెక్కులు నిజాంసాగర్ ప్రాజెక్టులోకి వస్తున్నాయని చెప్పారు. నీటిపారుదలశాఖ ఈఎన్‌సీ మురళీధర్ రావు, జిల్లా రైతు సమితి అధ్యక్షుడు అంజిరెడ్డి ఉన్నారు.

వివాహేతర సంబంధం వద్దన్నందుకు..

- మహిళ దారుణ హత్య
- నిందితుడిని అరెస్టు చేసిన పోలీసులు


మాట్లాడుతున్న ఏసీపీ కిరణ్‌కుమార్

ఖలీల్‌వాడి: వివాహేతర సంబంధం వద్దన్నందుకు మహిళను హతమార్చాడో వ్యక్తి. నగరంలోని బ్యాంక్ కాలనీ సమీపంలోని రమాదేవి వెంచర్‌లో హత్యకు గురైన మహిళ కేసును పోలీసులు ఛేదించారు. నిందితుడిని అరెస్టు చేసి, రిమాండ్ చేసినట్లు ఏసీపీ కిరణ్‌కుమార్ తెలిపారు. నాలుగో టౌన్ పోలీస్ స్టేషన్‌లో శనివారం ఆయన వివరాలు వెల్లడించారు. బ్యాంక్ కాలనీకి చెందిన కస్తూరి(28) ఈ నెల 22న పనికి వెళ్లి తిరిగి రాలేదు. దీంతో ఆమె భర్త సంగెం మల్లేశ్ 25న పోలీసులకు ఫిర్యాదు చేశాడు. అదే రోజు సాయంత్రం రమాదేవి వెంచర్‌లోని ఖాళీ ఇంటిలోని బాత్‌రూమ్‌లో కస్తూరి శవం కుళ్లిపోయి లభించింది. గోడకు బాది ఆమెను హతమార్చినట్లు పోలీసులు గుర్తించారు. అదేకాలనీకి చెందిన సిరిగోయ అలియాస్ సిరికొండ శంకర్‌తో ఆమె వివాహేతర సంబంధం కొనసాగించడానికి ఒప్పుకోకపోవడంతో హతమార్చినట్లు ఏసీపీ తెలిపారు. అనంతరం ఆమె ఫోన్‌తో నిందితుడు పరారయ్యాడన్నారు. శనివారం శంకర్‌ను అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించినట్లు తెలిపారు. కేసును ఛేదించిన టౌన్ సీఐ వెంకటనారాయణ, ఎస్సై సందీప్, సిబ్బందిని ఏసీపీ అభినందించారు.

పేలిన ఎలక్ట్రిక్ స్కూటీ బ్యాటరీ


పేలిన బ్యాటరీ

వేల్పూర్: మండలంలోని పోచంపల్లిలో ఎలక్ట్రిక్ స్కూటీ బ్యాటరీ పేలిపోయిన ఘటన ఆలస్యంగా బయటపడింది. గ్రామానికి చెందిన సుదారి యాదగిరి ఇంట్లో శుక్రవారం సాయంత్రం ఎలక్ట్రిక్ స్కూటీ బ్యాటరీ పేలి మంటలు చెలరేగాయి. గ్రామస్తులు మంటలు ఆర్పి వేశారు. బ్యాటరీలో మంటలు చెలరేగినప్పుడు ఇంట్లో ఉన్న యాదగిరి అత్త జక్కుల విమల బయటికి రావడంతో ఆమెకు ప్రాణాపాయం తప్పింది. యాదగిరి రెండేళ్ల కిందట ఎలక్ట్రిక్ స్కూటీ కొనుగోలు చేశాడు. ఎప్పటి మాదిరిగా బ్యాటరీ చార్జింగ్ పూర్తి చేసి, స్కూటీలో పెట్టకుండా అలాగే బయట ఉంచి వెళ్లాడు. సాయంత్రం బ్యాటరీ పేలిపోయింది. మంటలు అంటుకొని ఇంట్లోని దుస్తులు, కుట్టు మిషన్ కాలిపోగా, తలుపులు పాడయ్యాయని బాధితుడు తెలిపారు.

రోడ్డు ప్రమాద బాధితులు క్షేమం

మాక్లూర్: మాక్లూర్ రఫత్‌ఖాన్ గార్డెన్ వద్ద ప్యాసింజర్ ఆటోను బొలెరో వాహనం ఢీకొట్టిన ఘటనలో గాయపడ్డ వారందరు క్షేమంగా ఉన్నట్లు వారి కుటుంబ సభ్యుల ద్వారా తెలిసింది. నందిపేట నుంచి నిజామాబాద్ వెళ్తున్న ప్యాసింజర్ ఆటోను శుక్రవారం ఉదయం బియ్యం లోడుతో వెళ్తున్న బొలెరో వాహనం ఢీకొన్న విషయం తెలిసిందే. ఈ ప్రమాదంలో గాయపడ్డ పది మంది ప్రస్తుతం చికిత్స పొందుతున్నారు.

టీడీపీ పాలనలోనే బలహీన వర్గాల అభివృద్ధి

- టీడీపీ రాష్ట్ర అధ్యక్షుడు కాసాని జ్ఞానేశ్వర్


మాట్లాడుతున్న టీడీపీ రాష్ట్ర అధ్యక్షుడు కాసాని

వర్ని(రుద్రూర్): బడుగు, బలహీన వర్గాల అభ్యున్నతి కోసం దివంగత ముఖ్యమంత్రి ఎన్టీ రామారావు అనేక పథకాలు అమలు చేశారని టీడీపీ రాష్ట్ర అధ్యక్షుడు కాసాని జ్ఞానేశ్వర్ అన్నారు. ఎన్టీఆర్ శత జయంతి కార్యక్రమంలో భాగంగా వర్నిలోని వీఎంఆర్ గార్డెన్‌లో శనివారం ఏర్పాటు చేసిన కార్యక్రమానికి ఆయన హాజరై మాట్లాడారు. ఎన్టీఆర్ అనంతరం సీఎంగా పని చేసిన చంద్రబాబునాయుడు దేశం గర్వించేటట్టు ఉమ్మడి రాష్ట్రాన్ని అభివృద్ధి చేశారన్నారు. పార్టీకి పునర్ వైభవం తీసుకురావాలని కార్యకర్తలకు సూచించారు. బాన్సువాడ నియోజకవర్గంలో టీడీపీ జెండా ఎగురుతుందని ధీమా వ్యక్తం చేశారు. తెలంగాణలో నిరుద్యోగ సమస్య తీవ్రంగా ఉందన్నారు. వచ్చే ఎన్నికల్లో అన్ని నియోజకవర్గాల్లో టీడీపీ పోటీ చేస్తుందని స్పష్టం చేశారు. రాష్ట్ర కార్యదర్శి విఠల్, షకీలా, కరాటే రమేష్ పాల్గొన్నారు.

'విజయ్ ఆత్మహత్యకు ప్రభుత్వమే కారణం'


కల్లెడిలో మాట్లాడుతున్న డీసీసీ అధ్యక్షుడు

మాక్లూర్: మండలంలోని కల్లెడి ప్రాథమిక పాఠశాల కమిటీ చైర్మన్ విజయ్ ఆత్మహత్యకు ప్రభుత్వమే బాధ్యత వహిస్తూ అతని కుటుంబానికి రూ.25 లక్షల పరిహారం ఇవ్వాలని కాంగ్రెస్ జిల్లా అధ్యక్షుడు మానాల మోహన్‌రెడ్డి డిమాండ్ చేశారు. శనివారం ఆయన బాధిత కుటుంబాన్ని పరామర్శించి, రూ.పది వేల ఆర్థికసాయం చేశారు. అనంతరం మాట్లాడుతూ.. ఎస్ఎంసీ చైర్మన్‌గా విజయ్ మన ఊరు మన బడి పనులను కాంట్రాక్ట్ తీసుకొని పూర్తి చేశారన్నారు. ఖర్చు చేసింది అధిక మొత్తంలో ఉంటే పంచాయితీ రాజ్ ఏఈ ఎంబీ చేసింది నామమాత్రంగా చేశాడని ఆరోపించారు. బీఆర్ఎస్ నాయకులు ఏఈపై ఒత్తిడి తెచ్చి బిల్లులు తక్కువ చేస్తూ ఎంబీ చేయించారని ఆరోపించారు. దీంతోనే విజయ్ ఆత్మహత్య చేసుకున్నాడన్నారు. విజయ్ ఆత్మహత్యకు కారణమైన స్థానిక బీఆర్ఎస్ నాయకులతో పాటు పంచాయతీ రాజ్ ఏఈపై చర్యలు చేపట్టాలని డిమాండ్ చేశారు. పార్టీ జిల్లా కార్యదర్శి డ్యాగ పోశెట్టి, మండల అధ్యక్షుడు వెంకటేశ్వర్ రావు, ఎన్ఎస్‌యుఐ జిల్లా అధ్యక్షుడు వేణురాజ్, ప్రవీణ్, రమేష్, శ్రీనివాస్, ఎడ్ల పోశెట్టి, ప్రకాష్, మహేష్, కృష్ణ ఉన్నారు.

సిద్ధరామేశ్వర ఆలయంలో హైకోర్టు జడ్జి పూజలు


శ్రీసిద్ధరామేశ్వరాలయంలో హైకోర్టు న్యాయమూర్తి శ్రీసుధ

భిక్కనూరు: భిక్కనూరు శ్రీ సిద్ధరామేశ్వరాలయాన్ని హైకోర్టు న్యాయమూర్తి శ్రీసుధ శనివారం సందర్శించారు. ఆలయ పునర్ నిర్మాణకమిటీ ఆధ్వర్యంలో హైకోర్టు న్యాయమూర్తిని శాలువతో సత్కరించి తీర్థ ప్రసాదాలను అందజేశారు. జిల్లా కోర్టు న్యాయమూర్తి శ్రీదేవి, న్యాయమూర్తులు లాల్‌సింగ్ శ్రీనివాస్ నాయక్, కిరణ్‌కుమార్, ఆలయ కమిటీ చైర్మన్ మహేందర్‌రెడ్డి, ఈవో శ్రీధర్ పాల్గొన్నారు.